
సాక్షి వనపర్తి

సోమవారం ¦ 6 ¦ అక్టోబర్ ¦ 2025



వాహనాల బారులు

దసరాకు స్వగ్రామాలకు వచ్చిన వారు ఆదివారం తిరిగి వెళ్తుండటంతో జాతీయ రహదారిపై వాహనాల రద్దీ భారీగా పెరిగింది.

-8లో ▸



ఆర్చరీలో అదుర్స్

మహబూబ్‌నగర్‌కు చెందిన జ్ఞానేశ్వర్ విలువిద్యలో ఇటు క్రీడాకారుడిగా. అటు కోచ్‌గా రాణిస్తూ సత్తా చాటుతున్నారు.

-8లో ▸

గరిష్టం/కనిష్టం
33.8/22.3

వాతావరణం

రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతం అవుతుంది. ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సీఎం చొరవతోనే కేంద్రీయ విద్యాలయం మంజూరు



వనపర్తిటౌన్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతోనే జిల్లాకు కేంద్రీయ విద్యాలయం మంజూరైనట్లు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా. జిల్లెల చిన్నారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు కేంద్రీయ విద్యాలయం కోసం సీఎంను కోరగా.. ఆయన కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి మంజూరయ్యేలా కృషి చేశారని పేర్కొన్నారు. ఈ మేరకు సీఎంకు ధన్యవాదాలు తెలుపడంతో పాటు విద్యాలయ నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కేటాయింపు, నిధుల మంజూరు త్వరితగతిన జరిగేందుకు కృషి చేస్తానని తెలిపారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

వనపర్తి రూరల్: పెబ్బేరులోని కన్యకాపరమేశ్వరి ఆలయాన్ని ఆదివారం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి దర్శించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేయగా.. ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు.

రూ.13.20 లక్షలు పలికిన అమ్మవారి చీరలు



వనపర్తి రూరల్: మండలంలోని చిట్యాల రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద ప్రతిష్ఠించిన దుర్గాదేవికి దేవి శరవన్నవరాత్రి ఉత్సవాల్లో అలంకరించిన చీరల వేలాన్ని శనివారం రాత్రి ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. గ్రామంలోని భక్తులు వేలంలో పాల్గొని రూ.13.20 లక్షలకు దక్కించుకున్నారు. అందులో ఒక చీరను తిరుపతిరావు అనే భక్తుడు రూ.2.05 లక్షలు పాటపాడి దక్కించుకున్నారు.

11న పీయూలో జాబ్‌మేళా

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పురుష అభ్యర్థులకు ఈ నెల 11న పీయూ క్యాంపస్‌లో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్లేస్‌మెంట్ అధికారి అర్జున్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, మైక్రో బయాలజీ, ఎం-ఫార్మసీ, బీ-ఫార్మసీ, బీటెక్ (మెకానికల్, ఎలక్ట్రికల్, కెమికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్), బీఎస్సీ కెమిస్ట్రీ, ఇంటర్, ఐటీఐ 2021 నుంచి 2025 మధ్య ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. ఆసక్తి గలవారు ఈ నెల 8లోగా https://forms.gle/ctBZNQ1ByU5B6xKB6 రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు సెల్ నం.98494 45877ను సంప్రదించాలని సూచించారు. టీజీసీహెచ్‌సీ, జాతీయ బల్క్ డ్రగ్ తయారీదారుల సమాఖ్య సహకారంతో ఈ నెల 11 ఉదయం 10 గంటల నుంచి పీయూలోని పీజీ కళాశాల సెమినార్ హాల్‌లో ఎంపికలు నిర్వహిస్తామన్నారు. ఎంపికై న వారు ఆయా కంపెనీల్లో క్యూసీ, క్యూ, కెమిస్ట్, మెషిన్ ఆపరేటర్లుగా పనిచేయాల్సి ఉంటుందన్నారు.

నేతన్న.. నిరాశ

ఏడాది పూర్తయినా అమలుకు నోచుకోని రుణమాఫీ



అమరచింత చేనేత ఉత్పత్తుల సంఘంలో మగ్గంపై చీరలు నేస్తున్న కార్మికులు (ఫైల్)

- జిల్లాలో 338 మంది కార్మికులు అర్హులుగా గుర్తింపు
- రుణగ్రస్తుల వివరాలు సేకరించినా.. ఫలితం శూన్యం
- రూ.2.21 కోట్ల మాఫీపై వీడని చిక్కుముడి
- రుణబకాయిలు చెల్లించాలంటూ బ్యాంకు సిబ్బంది ఒత్తిడి

అమరచింత: రైతుల మాదిరి నేత కార్మికులకు కూడా రూ.లక్ష రుణమాఫీ వర్తింపజేస్తున్నామని గతేడాది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా ప్రకటించారు. ఏడాది పూర్తయినా ఇప్పటి వరకు వర్తింపజేయకపోవడం.. బ్యాంకు సిబ్బంది రుణాలు తిరిగి చెల్లించాలంటూ వత్తిడి పెంచడంతో నేత కార్మికులు ఆందోళన చెందుతున్నారు. చేనేత, జౌళిశాఖ అధికారులు రుణమాఫీ అర్హుల జాబితాను సదరు బ్యాంకర్ల నుంచి సేకరించి పూర్తి నివేదికను రాష్ట్ర కమిటీకి అప్పగించినా.. నేటికీ కార్మికుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమకాలేదు. ఇటీవల తీసుకున్న రుణం తిరిగి చెల్లించని కారణంగా అమరచింత యూనియన్ బ్యాంకు మేనేజర్ చేనేత కార్మికుల లావాదేవీలు నిలిపివేయడంతో కార్మికులు బ్యాంకు ఎదుట ఆందోళన చేపట్టారు. రుణమాఫీ గురించి జౌళిశాఖ అధికారులను అడిగితే ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తామని చెప్పిందని.. వచ్చిన వెంటనే రుణమాఫీ వర్తిస్తుందని చెప్పుకొస్తున్నారు. ప్రతి నెల రూ.వెయ్యి వడ్డీ చెల్లించాల్సి వస్తోందని.. లేదంటే బ్యాంకు ఖాతా లావాదేవీలు నిలిపివేస్తున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం సానుకులంగా స్పందించి రుణమాఫీ నిధులు వెంటనే విడుదల చేయాలని కోరుతున్నారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలోని అమరచింత, ఆత్మకూర్, పెద్దమందడి, కొత్తకోటలో నేత కార్మికులు తమ వృత్తిని కొనసాగిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. పెద్దమందడిలోని వెల్టూర్, ఖిల్లాఘనపురంలోని సోలీపురం గ్రామంలో మాత్రం ఉన్ని మగ్గాలు కొనసాగుతుండగా.. మిగిలిన ప్రాంతాల్లో మగ్గాలపై జరి చీరలు తయారు చేస్తున్నారు. జిల్లాలో 1,090 మంది నేత కార్మికులు ఉండగా.. జియో ట్యాగింగ్ కలిగిన మగ్గాలు 338 ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ప్రతి మగ్గానికి 3 కార్మికుల చొప్పున సంక్షేమ పథకాలు అమలవుతున్నాయి. అమరచింత చేనేత సహకార సంఘం సభ్యులు 309 మంది స్థానిక యూనియన్ బ్యాంక్, ఆత్మకూర్‌లోని డీసీసీబీ బ్యాంకులో చేనేత రుణాలు పొందారు. ఆత్మకూర్ మండలంలోని తిప్పడంపల్లిలో ఐదుగురు, కొత్తకోటలో 24 మంది నేతన్నలు రుణాలు తీసుకున్నట్లు అధికారుల లెక్కలు వెల్లడిస్తున్నాయి. రుణాలు పొందిన కార్మికుల వివరాలను డీసీఎల్ కమిటీ ఆమోదించి రాష్ట్ర కమిటీకి పంపి 5 నెలలు గడుస్తున్నా రుణమాఫీ నిధులు మంజూరుగాకపోవడంతో నేతన్నలు ఆందోళనకు గురవుతున్నారు. 2017 నుంచి చేనేత రుణం తీసుకున్న వారి వివరాలతో పాటు మొత్తం ఎంత మేర మాఫీ అవుతుందన్న విషయాలను సైతం జౌళిశాఖ అధికారులు వివరించారు. జిల్లావ్యాప్తంగా 338 మంది చేనేత కార్మికులు రుణం పొందారని.. రూ.2.21 కోట్ల రుణమాఫీ నేతన్నలకు అందనున్నట్లు తెలిపారు.



అమరచింత యూనియన్ బ్యాంకు ఎదుట ఆందోళన చేస్తున్న చేనేత కార్మికులు (ఫైల్)

రూ.75 వేలు తీసుకున్నా..



స్థానిక యూనియన్ బ్యాంక్‌లో రూ.75 వేల చేనేత రుణం తీసుకున్నా. క్రమం తప్పకుండా చెల్లించడం, లేదా ఏటా వడ్డీ చెల్లించి పునరుద్ధరించుకుంటూ వస్తున్నాం. ప్రభుత్వం చేనేత రుణమాఫీ వర్తింపజేస్తామని ప్రకటించడంతో వడ్డీ డబ్బులు చెల్లించలేదు. రుణం పునరుద్ధరించుకోవాలని.. లేని పక్షంలో ప్రతినెల రూ.750 వడ్డీ చెల్లించమంటూ బ్యాంకు మేనేజర్ వత్తిడి చేస్తున్నారు.

– కొంకతి శకుంతలమ్మ, నేత కార్మికురాలు, అమరచింత

లావాదేవీలు నిలిపివేశారు..



మా కుటుంబం చేనేతపై ఆధారపడి జీవిస్తోంది. కుటుంబ పోషణతో పాటు చీరల తయారీకి కావాల్సిన ముడి సరుకుల కోసం బ్యాంకులో రూ.75 వేల రుణం తీసుకున్నాం. ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ నేటికీ వర్తించకపోవడంతో రుణం చెల్లించాలని బ్యాంకు ఖాతా లావాదేవీలు నిలిపివేశారు. ఖాతా పునః ప్రారంభం కోసం వడ్డీ డబ్బులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నాం.

– గుండాల బుచ్చన్న, నేత కార్మికుడు, అమరచింత

ప్రభుత్వం స్పందించాలి..



రాష్ట్ర ప్రభుత్వం చేనేత రుణమాఫీ ప్రకటించి ఏడాది పూర్తయినా నేటికీ ఆ నిధులు మంజూరు చేయకపోవడంతో నేతన్నలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలీచాలని వేతనాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్న చేనేత కార్మికులపై బ్యాంకు మేనేజర్ వేధింపులు అధికమవుతున్నాయి. ప్రభుత్వం త్వరితగతిన రుణమాఫీ ప్రక్రియ పూర్తిచేసి నేతన్నలను ఆదుకోవాలి.

– వగ్గు రామలింగం, ఉపాధ్యక్షుడు, అమరచింత చేనేత సహకార సంఘం

నివేదిక అందించాం..



జిల్లాలో 338 మంది చేనేత కార్మికులకు రుణమాఫీ వర్తించనుంది. సుమారు రూ.2.21 కోట్లు కార్మికులకు అందనున్నాయి. పూర్తి వివరాలతో డీసీఎల్ కమిటీ ఆమోదం తర్వాత రాష్ట్ర కమిటీకి నివేదించాం. ప్రభుత్వం నుంచి నిధులు విడుదలైతే కార్మికుల ఖాతాల్లో నేరు గా రుణమాఫీ డబ్బులు జమ అవుతాయని కార్మికులకు వివరిస్తున్నాం. రుణాల పునరుద్ధరణ వ్యవహారం తమ పరిధి కాదని మా వద్దకు వస్తున్న నేతన్నలకు వివరిస్తున్నాం.

– గోవిందయ్య, ఏడీ, చేనేత జౌళిశాఖ, గద్వాల

న్యాయఫలాలు అందరికీ అందాలి



కోర్టు నూతన భవన సముదాయ నమూనాను చూపుతున్న హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ మాధవి, జస్టిస్ అనిల్ జూకంటి.. చిత్రంలో కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ రావుల గిరిధర్, ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్ సునీత తదితరులు

- మెరుగైన వసతులతోనే న్యాయసేవలు
- జిల్లాకేంద్రంలో రూ.81 కోట్లతో న్యాయస్థానాల సముదాయం నిర్మాణానికి శంకుస్థాపన
- వర్చువల్‌గా ప్రారంభించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అపరేష్‌కుమార్ సింగ్



కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, న్యాయవాదులు తదితరులు

వనపర్తిటౌన్: న్యాయసేవలు సామాన్యుల దరి చేరేందుకు న్యాయమూర్తులు, న్యాయవాదులు మెరుగైన పాత్ర పోషించాలని తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్‌కుమార్ సింగ్ అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని వైద్యకళాశాల సమీపంలో రూ.81 కోట్లతో 20 ఎకరాల విస్తీర్ణంలో కోర్టు సముదాయం నిర్మాణానికి వర్చువల్‌గా శంకుస్థాపన చేసి శిలా ఫలకాన్ని ఆవిష్కరించగా.. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ మాధవి, జస్టిస్ అనిల్ జూకంటి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ.. న్యాయవాదులు కక్షిదారులకు న్యాయ ఫలాలు చేరువ చేసేందుకు తగిన చొరవ చూపాలని సూచించారు. ప్రజలకు న్యాయవ్యవస్థపై బలమైన విశ్వాసం ఉందని... దానిని పదిలపర్చడంలో న్యాయవాదులు ముందుండాలన్నారు. మెరుగైన వసతులతో కూడిన న్యాయస్థానాల ద్వారా అందరికీ న్యాయ ఫలాలు దక్కాలని ఆకాంక్షిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం కోర్టు ఆవరణలో నిర్వహించిన సమావేశంలో జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి మాట్లాడుతూ... న్యాయవ్యవస్థలో ప్రజలందరికీ న్యాయం చేకూర్చడానికి మౌలిక వసతుల ఏర్పాటు అవసరమన్నారు. కోర్టు సముదాయ నిర్మాణంలో అందరి కృషి ఉందని.. జిల్లాలో లీగల్ లిటరసీ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జస్టిస్ మాధవి మాట్లాడుతూ.. తాను ఉమ్మడి పాలమూరు జిల్లా ఆడబిడ్డనే అని చెబుతూ, వనపర్తిలో సంస్థానాధీశుల కాలం నుంచే న్యాయస్థానాలు ఏర్పాటు చేసి ప్రజలకు న్యాయసేవలు అందించే వ్యవస్థ ఉందని గుర్తుచేశారు. కొత్త భవనాల నిర్మాణంలో వనపర్తి బార్ అసోసియేషన్ సభ్యులు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి కృషి ఉందన్నారు.

సముదాయ నిర్మాణం శుభ పరిణామం

జిల్లాకేంద్రంలో కోర్టు సముదాయ నిర్మాణానికి అడుగులు పడటం శుభపరిణామమని, ఇది తనకు మరచిపోలేని రోజుని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. దేవాలయం లాంటి కోర్టు భవనంలో ప్రతి ఒక్కరికి న్యాయ ఫలాలు అందించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. రిటైర్డ్ న్యాయమూర్తి, తెలంగాణ ఈఆర్సీ చైర్మన్ నాగార్జున మాట్లాడుతూ.. వనపర్తిలో కోర్టు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసుకోవడం ఆనందంతో పాటు భావోద్వేగానికి గురి చేస్తుందన్నారు. తాను వనపర్తిలో పుట్టి పెరిగి ఇక్కడి బార్ కౌన్సిల్ సభ్యుడిగా పనిచేసి ఈ రోజు అనేక హోదాల్లో విధులు నిర్వర్తించినట్లు గుర్తు చేసుకున్నారు. ఎస్పీ రావుల గిరిధర్ మాట్లాడుతూ.. వనపర్తి సంస్థానాధీశుల కాలం నుంచే కవులు, కళాకారులకు పుట్టినిల్లు అని, తిరుపతి వేంకట కవులను సైతం సత్కరించిన చరిత్ర వనపర్తికి ఉందని తెలిపారు. కోర్టు భవన నిర్మాణంలో పోలీసుశాఖకు అవసరమైన సదుపాయల గురించి న్యాయమూర్తి మాధవిదేవిని కోరగా ఆమె సానుకూలంగా స్పందించినట్లు చెబుతూనే ఆమెకు ధన్యవాదాలు తెలిపారు. అంతకుముందు జిల్లాకు వచ్చిన హైకోర్టు న్యాయమూర్తులకు ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో కలెక్టర్, ఎస్పీ పూల మొక్కలు అందజేసి సాధారంగా స్వాగతం పలికారు. అదేవిధంగా శంకుస్థాపన ప్రదేశంలో న్యాయమూర్తులు పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించడంతో పాటు కోర్టు భవన నిర్మాణ ప్రాంగణంలో ముఖ్యఅతిథులు మొక్కలు నాటారు. వనపర్తి బార్ అసోసియేషన్ సభ్యులు హైకోర్టు న్యాయమూర్తులు, ముఖ్యఅతిథులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్ సునీత, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, వనపర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీపీ కిరణ్‌కుమార్, న్యాయమూర్తులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు బిడ్డలు మట్టిలో మాణిక్యాలు



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

వనపర్తి రూరల్: కమ్యూనిస్టు ఉద్యమాలను నిర్మించడంలో, వాటిని కొనసాగించడంలో, భావితరాలకు ఉద్యమాల బాట వేయడంలో పాలమూరు బిడ్డలు మట్టిలో మాణిక్యాలుగా తయారయ్యారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. ఆదివారం మండలంలోని చిట్యాలలో ఉన్న ఓ కన్వెన్షన్ హాల్‌లో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ జబ్బార్ అధ్యక్షతన పుట్టా వరలక్ష్మి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయనతో పాటు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, పలువురు రాష్ట్ర ,కేంద్ర కమిటీ సభ్యులు పాల్గొని ఆమే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామ్రేడ్ వరలక్ష్మి విద్యార్థి దశ నుంచే ఉద్యమ బాటపట్టి విద్యార్థి ఉద్యమంలో చురుగ్గా పనిచేస్తున్న పుట్టా ఆంజనేయులుకు తోడునీడగా ఉండేందుకు నిర్ణయించుకొని జీవిత సహచరి కావడం గొప్ప విషయమన్నారు. వందలాది మంది మహిళలు లక్ష్మీదేవమ్మ, వరలక్ష్మిలుగా తయారు కావాలని ఆకాంక్షించారు.

రామన్‌పాడులో పూర్తిస్థాయి నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో ఆదివారం సముద్రమట్టానికిపైన 1,021 అడుగుల పూర్తిస్థాయి నీటిమట్టం ఉన్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు. జూరాల ఎడమ కాల్వ నుంచి 1,030 క్యూసెక్కుల వరద జలాశయానికి చేరుతుండగా.. సమాంతర కాల్వలో నీటి సరఫరా లేదని చెప్పారు. అలాగే జలాశయం నుంచి ఎన్టీఆర్ కాల్వకు 875 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వలకు 55 క్యూసెక్కులు, వివిధ ఎత్తిపోతల పథకాలకు 757 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగించినట్లు వివరించారు.

పొంచి ఉన్న ప్రమాదం



ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాల్వ వెంట రామన్‌పాడు రిజర్వాయర్ వరకు ఉన్న కాల్వపై నిర్మించిన వంతెనలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కాల్వ వెంట ఉన్న కచ్చా రహదారిపై ఆటోలు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. మూలమళ్ల-నందిమళ్ల సమీపంలో ఉన్న ఎడమ కాల్వ వద్ద వంతెన దిమ్మెలు కూలి ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ఆయా గ్రామస్తులు ఆందోళనకు గురవుతున్నారు. అధికారులు, పాలకులు పట్టించుకొని కాల్వ వెంట ఉన్న శిథిల వంతెనల మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

– అమరచింత

- రావిర్యాల- ఆమనగల్- మన్ననూర్ నాలుగు వరుసల గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు ప్రతిపాదనలు
- మన్ననూర్- శ్రీశైలం మార్గంలో ఎలివేటెడ్ కారిడార్
- హైదరాబాద్- శ్రీశైలం మార్గంలో 40 కి.మీ. తగ్గనున్న దూరం

మరో కొత్త రహదారి

ఫ్యూచర్ సిటీ నుంచి మన్ననూర్ వరకు అనుసంధానం



మన్ననూర్ వద్ద శ్రీశైలం వెళ్లే జాతీయ రహదారి-765 ముఖద్వారం

అచ్చంపేట: హైదరాబాద్- శ్రీశైలం జాతీయ రహదారి-765 త్వరలోనే నాలుగు వరుసలుగా మారనుంది. రావిర్యాల- ఆమనగల్- మన్ననూర్ గ్రీన్‌ఫీల్డ్ రహదారితోపాటు శ్రీశైలం జాతీయ రహదారిలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వు ఫారెస్టులో వన్యప్రాణులకు ఇబ్బంది కలగకుండా మన్ననూర్- శ్రీశైలం మధ్య నాలుగు వరుసల ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గత నెల 9న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరగా.. ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం గేట్ నుంచి ఆమనగల్, కొత్త, డిండి, హాజీపూర్ (బ్రాహ్మణపల్లి) వరకు నాలుగు వరుసల రహదారి ఏర్పాటుకు సర్వే నిర్వహించి.. హద్దులు కూడా నిర్ణయించారు. ఈ రహదారి విస్తరణకు మూడేళ్ల క్రితమే కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినప్పటికీ నిధులు మాత్రం మంజూరు కాలేదు. ఇప్పుడు కొత్త గ్రీన్ ఫీల్డ్ రహదారితో ఇబ్బందులు తొలగనున్నాయి.

ఆకుతోటపల్లి- మన్ననూర్..

శ్రీశైలం, నాగార్జునసాగర్ జాతీయ రహదారులకు అనుసంధానంగా ఫ్యూచర్ (ఫోర్త్) సిటీని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. రెండు జాతీయ రహదారుల మధ్య నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు ఎంతో కీలకం కానుంది. రావిర్యాల ఓఆర్ఆర్ ఎగ్జిట్ 13 నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు.. అక్కడి నుంచి రీజినల్ రింగ్ రోడ్డు ఆమనగల్ (ఆకుతోటపల్లి) వరకు ప్రతిపాదించిన 330 అడుగుల రతన్‌టాటా గ్రీన్‌ఫీల్డ్ రహదారికి ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తయింది. మొదటి దశలో రావిర్యాల నుంచి మీర్‌ఖాన్‌పేట్ వరకు రూ.1,665 కోట్లతో చేపట్టనున్న 19.20 కి.మీ. రోడ్డును రిత్విక్ సంస్థ, రెండో దశలో మీర్‌ఖాన్‌పేట్ నుంచి ఆమనగల్ వరకు చేపట్టనున్న 22.3 కి.మీ. రోడ్డును ఎల్‌అండ్‌టీ సంస్థ రూ.2,365 కోట్లకు దక్కించుకున్నాయి. భూ సేకరణ, టెండర్ ప్రక్రియ చేపట్టిన ప్రభుత్వం.. తాజాగా ఇటు నుంచి మన్ననూర్ వరకు కొత్త రోడ్డును విస్తరించే ప్రతిపాదనలు సిద్ధం చేసింది. భారత్ ఫ్యూచర్ సిటీలో భాగంగా నిర్మిస్తున్న రావిర్యాల- ఆమనగల్ (ఆకుతోటపల్లి), ఆర్ఆర్ఆర్ గ్రీన్‌ఫీల్డ్ రహదారి నుంచి అచ్చంపేట మండలం బ్రాహ్మణపల్లి (మన్ననూర్) వరకు కొత్త రోడ్డు ఏర్పాటు కానుంది. ఇందుకు సంబంధించిన డిజైన్‌ను సంబంధిత అధికారులు సిద్ధం చేస్తున్నారు. జూపల్లి- చారకొండ మధ్య నుంచి భైరాపూర్, డిండి తూర్పుభాగం మీదుగా గువ్వలోనిపల్లి, రాయిచేడ్, బుడ్డతండా, బ్రాహ్మణపల్లి వరకు ప్రతిపాదిత ఎలివేటెడ్ కారిడార్ సుమారు 50 కి.మీ. దూరం అవుతుంది. ప్రతిపాదిత రోడ్డు ఏర్పాటైతే హైదరాబాద్- శ్రీశైలం మధ్య 40 కి.మీ. దూరం తగ్గడంతోపాటు రెండు గంటల వ్యవధిలో చేరుకోవచ్చు. ప్రస్తుతం ఉన్న హైదరాబాద్- శ్రీశైలం హైవేలోని తుక్కుగూడ, కందుకూరు, కడ్తాల్, ఆమనగల్, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, నంద్యాల వరకు తిరుపతి మార్గంగా, రావిర్యాల నుంచి మన్ననూర్ వరకు శ్రీశైలం రహదారులు వేరు కానున్నాయి. కొత్త రహదారితో ట్రాఫిక్ సమస్య తీరనుందని ప్రభుత్వం భావిస్తోంది.

ఎలివేటెడ్ కారిడార్‌కు సుముఖత..

హైదరాబాద్- శ్రీశైలం జాతీయ రహదారిలో నాలుగు వరుసల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అంగీకరించినట్లు సమాచారం. రూ.7,700 కోట్ల అంచనాలతో చేపట్టే ఎలివేటెడ్ కారిడార్ పూర్తయితే శ్రీశైలం రహదారి రూపురేఖలు మారిపోనున్నాయి. ఈ మార్గంలో ఏపీలోని కృష్ణపట్నం రేవుతోపాటు మార్కాపురం, కంభం, కనిగిరి, నెల్లూరు, తిరుపతికి రాకపోకలు సులువు అవుతాయి. ఇప్పటికే పలు ప్రతిపాదనలు రూపొందించగా.. 62.5 కి.మీ., ఎలివేటెడ్ కారిడార్‌లో 56.2 కి.మీ., అటవీ మార్గం, 6.3 కి.మీ. అటవీయేతర ప్రాంతం. స్వల్ప మార్పులతో ఎన్‌హెచ్ఏఐ అధికారులు మన్ననూర్, వటువర్లపల్లి వద్ద ఎక్కి, దిగేందుకు ర్యాంపుల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేశారు. అచ్చంపేట మండలం బ్రాహ్మణపల్లి నుంచి అమ్రాబాద్ మండలం మన్ననూర్ మీదుగా శ్రీశైలం ప్రాజెక్టు వరకు నాలుగు వరుసలతో 30 అడుగల ఎత్తులో ఈ రహదారిని నిర్మించాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. ఈగలపెంట (కృష్ణగిరి)- సున్నిపెంట మధ్య ఉన్న డ్యాంపై ఐకానిక్ వంతెన నిర్మించనున్నారు. దీంతో తెలంగాణ- ఆంధ్రప్రదేశ్ మధ్య గంట ప్రయాణ సమయం, 9 కి.మీ. దూరం తగ్గే అవకాశం ఉంది. అయితే కేంద్ర అటవీశాఖ అనుమతుల కోసం ఎన్‌హెచ్ఏఐ అధికారులు ప్రయత్నిస్తున్నారు.

ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు..



ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లగా.. సానుకూలంగా స్పందించారు. ఫ్యూచర్ సిటీ నుంచి ఆకుతోటపల్లి వరకు ఇప్పటికే గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ పూర్తయింది. ఆకుతోటపల్లి నుంచి బ్రాహ్మణపల్లి వరకు కొత్త గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు కోసం అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఈ రహదారి నిర్మాణం జరిగితే హైదరాబాద్- శ్రీశైలం మధ్య సుమారు 40 కి.మీ. దూరం తగ్గుతుంది.

– వంశీకృష్ణ, ఎమ్మెల్యే, అచ్చంపేట

ఆర్టీసీలో ‘దసరా’ జోష్



మహబూబ్‌నగర్ బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

- తిరుగు ప్రయాణం కోసం ప్రత్యేక బస్సులు
- బస్టాండ్లలో కిక్కిరిసిన ప్రయాణికులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీలో దసరా జోష్ నెలకొంది. ఈ ఏడాది దసరా పండుగను పురస్కరించుకొని ఆర్టీసీ మహబూబ్‌నగర్ రీజియన్ పరిధిలో 641 అదనపు బస్సు సర్వీసులను నడిపారు. రీజియన్‌లోని పది డిపోల నుంచి గత నెల 20నుంచి ఈ నెల 2వ తేదీ వరకు ప్రత్యేక బస్సు సర్వీసులు అందుబాటులో ఉన్నాయి. హైదరాబాద్ రూట్‌లో ఎక్కువగా బస్సు సర్వీసులు నడిపారు.

తిరుగు ప్రయాణంలోనూ..

దసరా సెలవులు ముగియడంతో రెండు రోజులుగా ఆర్టీసీ బస్టాండ్లలో ప్రయాణికుల రద్దీ పెరిగింది. స్వగ్రామాల నుంచి తిరుగు ప్రయాణం కావడంతో హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులు కిక్కిరిసిపోయాయి. ప్రయాణికుల రద్దీ మేరకు తిరుగు ప్రయాణం కోసం మహబూబ్‌నగర్ రీజియన్ పరిధిలో ప్రత్యేకంగా దాదాపు 75 అదనపు బస్సులు నడుపుతున్నారు. సోమవారం కూడా ప్రయాణికుల రద్దీ ఉండే అవకాశం ఉంది.

హైదరాబాద్ రూట్‌లో అధికం..

ముఖ్యంగా హైదరాబాద్ రూట్‌లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా కనిపిస్తోంది. ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రధాన బస్టాండ్ల నుంచి హైదరాబాద్‌కు వెళ్లే బస్సులు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. ఆర్టీసీ ఉద్యోగులు మైక్ ద్వారా ఎప్పటికప్పుడు బస్సుల సమాచారం అందిస్తున్నారు. అదే విధంగా వనపర్తి, తాడూర్, నాగర్‌కర్నూల్, మద్దూర్ రూట్లలో కూడా ప్రయాణికుల రద్దీ ఉంది. ఆయా ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో ప్రయాణికులు ఎగబడి ఎక్కుతున్నారు.



హైదరాబాద్ వెళ్లే బస్సు వద్ద ప్రయాణికుల రద్దీ

గంటల తరబడి నిరీక్షణ

ఎర్రవల్లి: ఆర్టీసీ బస్సుల కోసం ఆదివారం ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షించారు. దసరా సెలవులు ముగిసిన నేపథ్యంలో వివిధ గ్రామాలకు చెందిన ప్రయాణికులు హైదరాబాద్, కర్నూలు తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు ఎర్రవల్లి చౌరస్తాకు భారీగా చేరుకున్నారు. కూడలిలో ఎటు చూసినా ప్రయాణికుల రద్దీ కనిపించింది. ఆయా ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో రద్దీ కారణంగా ఎర్రవల్లి చౌరస్తా వద్ద ఆపకుండా వెళ్లడంతో ప్రయాణికులు గంటల తరబడి మండుటెండలో వేచి ఉన్నారు. పలువురు మహిళలు గంటల తరబడి రోడ్డుపై నిలబడలేక ఉచిత బస్సు ప్రయాణ వసతిని సైతం వదులుకొని ప్రైవేటు వాహనాల్లో తరలివెళ్లారు.



ఎర్రవల్లి చౌరస్తాలో మండుటెండలో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

వాహనాల బారులు..



అడ్డాకుల మండలం శాఖాపూర్ టోల్‌ప్లాజా వద్ద నిలిచిన ట్రాఫిక్



పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ

- 44వ జాతీయ రహదారిపై పెరిగిన రద్దీ
- శాఖాపూర్, పుల్లూరు టోల్‌ప్లాజాల వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం
- వేముల స్టేజీ, బాలానగర్ వద్ద అదే పరిస్థితి

అడ్డాకుల/రాజాపూర్/ఉండవెల్లి: దసరా సెలవులు ముగిసిన నేపథ్యంలో 44వ నంబర్ జాతీయ రహదారి ఆదివారం వాహనాలతో కిక్కిరిసిపోయింది. హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలు హైవేపై బారులు తీరాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాయలసీమ ప్రాంతానికి చెందిన వారు దసరా పండుగకు స్వగ్రామాలకు వచ్చి తిరుగు ప్రయాణం కావడంతో.. జాతీయ రహదారిపై వాహనాల రద్దీ భారీగా పెరిగింది. గతంలో ఎన్నడూ లేని విధంగా రహదారిపై వాహనాలు వరుస కట్టాయి. ఉండవెల్లి మండలం పుల్లూరు టోల్‌ప్లాజాతో పాటు అడ్డాకుల మండలంలోని శాఖాపూర్ టోల్‌ప్లాజా వద్ద మధ్యాహ్నం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు హైదరాబాద్ రోడ్డుపై వాహనాలు బారులు తీరాయి. టోల్‌ప్లాజాల నుంచి 2 కి.మీ. నుంచి 3 కి.మీ. దూరం ట్రాఫిక్ నిలిచిపోయింది. రెండు వరుసల్లో వాహనాలు వెళ్లడానికి అనువుగా ఉండే రహదారిపై మూడు వరుసల్లో వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఇదిలా ఉంటే, టోల్‌ప్లాజా వద్ద ఫాస్టాగ్ సెన్సార్లు ఆశించి వేగంగా పని చేయకపోవడం కూడా టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీకి ఒకింత కారణమైందని వాహనదారులు వాపోయారు. ట్రాఫిక్ సమస్యను తెలుసుకున్న కొందరు వాహనదారులు పంచలింగాల మీదుగా భైరాపురం వైపు వచ్చి అలంపూర్ చౌరస్తా మీదుగా ప్రయాణించారు.

బ్రిడ్జిల నిర్మాణం వద్ద సైతం..

మూసాపేట మండలం వేముల స్టేజీ, బాలానగర్ మండల కేంద్రంలో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ఇక్కడ హైదరాబాద్, కర్నూలు వైపు వెళ్లే వాహనాలను కొన్నాళ్ల నుంచి సర్వీస్ రోడ్లపైకి వదిలి.. ప్రధాన రోడ్డును తవ్వారు. సర్వీస్ రోడ్డుపై ఒకే వరుసలో వాహనాలు వెళ్లాల్సి ఉండటంతో కూడా భారీగా ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. వేముల స్టేజీ నుంచి సుమారు 3 కి.మీ. మేర వాహనాలు వరుస కట్టాయి. రెండు వరుసల్లో వెళ్లాల్సిన వాహనాలు ఒకే వరుసలో వెళ్లాల్సి వచ్చింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. శాఖాపూర్ టోల్‌గేట్ వద్ద ట్రాఫిక్ సమస్యను దాటి.. రెండు కిలోమీటర్ల దూరం వెళ్లక ముందే మరో రెండు, మూడు కిలోమీటర్ల దూరం వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. ఇదిలా ఉంటే, కృష్ణా పుష్కరాల సమయంలో జాతీయ రహదారిపై కనిపించిన ట్రాఫిక్ మళ్లీ ఇప్పుడు కనిపించడం గమనార్హం.



మూసాపేట మండలం వేముల స్టేజీ వద్ద వాహనాల బారులు

క్లుప్తంగా

ఉరేసుకొని విద్యార్థి ఆత్మహత్య



వస్పరి చింటు (ఫైల్)

కల్వకుర్తి రూరల్: ఇంట్లో ఉరేసుకొని విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. కల్వకుర్తి ఎస్ఐ -2 రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తర్నికల్ గ్రామానికి చెందిన వస్పరి మల్లేష్, రాములమ్మ దంపతులు 20 ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన భూమిపై జరిగిన తగదాల గురించి మాట్లాడుకుంటున్నారు. ఈ విషయాలు విన్న చింటు(13) తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు ఇంట్లో ఫ్యాన్‌కు వేలాడుతున్న చింటు మృతదేహం చూసి కన్నీరుమున్నీరు అయ్యారు. చింటు రంగారెడ్డి జిల్లా రాచులూరులోని గురుకులంలో 9వ తరగతి చదువుతున్నాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తండ్రి మల్లేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రెండో ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

కృష్ణాబ్రిడ్జి గోడకు ఢీకొని వ్యక్తి దుర్మరణం

కృష్ణా: కృష్ణానదిపై ఉన్న బ్రిడ్జి గోడకు ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కర్ణాటకలోని దేవసూగూర్ గ్రామానికి చెందిన ఖాజాహుస్సేన్(40) ఉదయం ఇటువైపు ఉన్న టైరోడ్డు ప్రాంతానికి ఏదో పని కోసం వచ్చాడు. తాగిన మైకంలో మధ్యాహ్నం తన స్వగ్రామానికి తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా బ్రిడ్జిగోడకు ఢీకొట్టాడు. ఆ సమయంలో బోర్లపడడంతో అక్కడికక్కడే చనిపోయాడు. ఈ విషయం తెలిసిన వెంటనే కృష్ణా ఎస్ఐ ఎండీ నవీద్ అక్కడికి చేరుకొని క్షతగాత్రుని చికిత్స నిమిత్తం రాయచూర్ రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ డాక్టర్లు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్ రొటోవేటర్‌లో ఇరుక్కొని యువకుడు మృతి



రాజు (ఫైల్)

పాన్‌గల్: ట్రాక్టర్ రొటోవేటర్‌లో ఇరుక్కొని యువకుడు మృతి చెందిన ఘటన గోపాల్‌పేట మండలం ఏదుట్లలో ఆదివారం జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండలంలోని కేతేపల్లికి చెందిన కుర్వ మణ్ణెమ్మ, ఆగ్రేసు కుమారుడు రాజు(28) అమ్మమ్మ గ్రామమైన ఏదుట్లలో పొలాన్ని కౌలు తీసుకొని వ్యవసాయం చేయిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం పొలాన్ని ట్రాక్టర్ రొటోవేటర్‌తో దున్నుతున్నారు. ఈ క్రమంలో రూటర్ స్క్రూను సరిచేస్తుండగా ట్రాక్టర్ డ్రైవర్ అకస్మాత్తుగా ట్రాక్టర్‌ను ముందుకు కదిలించడంతో రొటోవేటర్‌లో ఇరుక్కొని మృతి చెందాడు. మృతుడికి ఏడాది క్రితమే వివాహమైంది. రాజు మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

ఆర్చరీలో అదుర్స్



ఇంట్లో ఏర్పాటు చేసుకున్న ఆర్చరీ అకాడమీ

విలువిద్యలో సత్తా చాటుతున్న జ్ఞానేశ్వర్

- ఇంటిపైనే అకాడమీ ఏర్పాటు చేసుకున్న క్రీడాకారుడు
- క్రీడాకారుడిగా, కోచ్‌గా రాణింపు
- వలు దేశాల నుంచి క్రీడా సామగ్రి



తయారు చేసిన ఉడెన్ బాణాలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రానికి చెందిన జ్ఞానేశ్వర్ విలువిద్యలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించారు. ఎనిమిదేళ్ల వయస్సులో నాన్నతో కలిసి అచ్చంపేట నియోజకవర్గంలో వనవాసి కళ్యాణ పరిషత్ ఆధ్వర్యంలో అక్కడి చెంచులు చేసిన విల్లు సాధనను చూసి ఆ క్రీడనే తన కెరీర్‌గా మలుచుకున్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఇటు క్రీడాకారుడిగా రాణించడంతో పాటు కోచ్‌గా మరెందరో ఔత్సాహిక క్రీడాకారులను తీర్చిదిద్దుతున్నారు.

రాష్ట్ర, జాతీయస్థాయి టోర్నీల్లో..

2007లో తన కెరీర్‌ను ప్రారంభించిన జ్ఞానేశ్వర్ ఇప్పటి వరకు సుమారు 20కిపైగా రాష్ట్రస్థాయి, అంతర్ జిల్లా ఆర్చరీ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారు. 2014లో బెంగళూర్‌లో జరిగిన జాతీయస్థాయి సబ్ జూనియర్, 2017లో ఝార్ఖండ్ రాష్ట్రం రాంచీలో జరిగిన జూనియర్ నేషనల్, అదేవిధంగా పాలమూరు యూనివర్సిటీ నుంచి 2021 చండీగఢ్‌లో జరిగిన ఆలిండియా యూనివర్సిటీ పోటీల్లో పాల్గొన్నారు.

ఔత్సాహికుల కోసం..


తను ఇష్టంగా నేర్చుకున్న విలువిద్యను జిల్లాలోని ఔత్సాహిక క్రీడాకారులకు శిక్షణ అందించాలనే ఉద్దేశంతో శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. 11 ఏళ్ల కాలంలో తన వద్ద శిక్షణ తీసుకున్న సుమారు 300 మంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. చిన్నారులు శ్రీహిత, సాయి సిద్దిక్షా ఓ హిందీ, ఓ తెలుగు చానల్‌లో ప్రదర్శనలు ఇచ్చారు. టాలెంట్ హంట్ కార్యక్రమంలో పాల్గొని చక్కటి ప్రతిభ కనబర్చి అందరి మన్ననలు పొందారు. 2023–24లో కోల్‌కత్తాలోని నేతాజీ సుభాష్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్‌లో ఏడాది పాటు ఆర్చరీలో ఎన్ఐఎస్ డిప్లొమా పూర్తి చేశారు. గతేడాది డిసెంబర్‌లో ఝార్ఖండ్‌లోని టాటానగర్‌లో జరిగిన జాతీయస్థాయి సీనియర్ నేషనల్ ఆర్చరీ పోటీల్లో పాల్గొనే తెలంగాణ జట్టుకు కోచ్‌గా వ్యవహరించారు.

ఇంటిపైనే అకాడమీ..

తల్లిదండ్రుల సహకారంతో తన ఇంటిపైన సూర్య ఆర్చరీ అకాడమీని ఏర్పాటు చేసి ఔత్సాహిక క్రీడాకారులకు శిక్షణనిస్తున్నారు. అకాడమీలో ప్రపంచంలోని మెరుగైన పరికరాలను సమకూర్చుకున్నారు. స్పెయిన్ నుంచి బోప్రెస్, అమెరికా నుంచి క్రాస్‌బో, ట్యూనింగ్ టూల్స్ అధునాతన పరికరాలను తెప్పించారు. తానే సొంతంగా కర్ర (ఉడెన్) బాణాలు తయారుచేసి క్రీడాకారులకు అందజేస్తున్నారు. ముఖ్యంగా అకాడమీలో కంప్యూటరైజ్డ్ అనలైజ్‌ను ఏర్పాటు చేశారు.

అంతర్జాతీయ క్రీడాకారులుగా..


నా వద్ద ఇండియన్ బౌ, రికర్వ్, కంపౌండ్ బౌ పరికరాలు ఉన్నాయి. అదేవిధంగా ఎంతో అధునాతమైన క్రాస్ బో ఉంది. త్వరలో అమెరికాకు వెళ్లి కంపౌండ్ బోలో ప్రత్యేక శిక్షణ తీసుకోవాలని చూస్తున్నా. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ముందుకుసాగుతున్నా. జిల్లా క్రీడాకారులను అంతర్జాతీయస్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యం.



– జ్ఞానేశ్వర్, ఆర్చరీ క్రీడాకారుడు, శిక్షకుడు

తప్పిపోయిన వృద్ధుడి అప్పగింత

మదనాపురం: ఇంటి నుంచి వెళ్లిపోయిన వృద్ధుడు తిరిగి కుటుంబసభ్యుల వద్దకు చేరుకున్న ఘటన ఆదివారం వెలుగుచూసింది. వివరాల్లోకి వెళ్తే.. ఏపీలోని అన్నమయ్య జిల్లా మొల్కల చెరువు గ్రామానికి చెందిన ఖాజా పీర్ ఖాన్(70)కు మతి స్థిమితం సరిగా లేదు. 15 రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయి ఆదివారం మదనాపూర్ మండలం రామన్‌పాడు గ్రామానికి చేరుకున్నాడు. అయితే ఎండీ అంజాద్ అలీ అనే యువకుడు వృద్ధుడిని గమనించి తప్పిపోయినట్లు గుర్తించి వివరాలు తెలుసుకున్నాడు. వృద్ధుడు అన్నమయ్య జిల్లా అని చెప్పడంతో జిల్లా ఎస్పీని సంప్రదించి విషయాన్ని తెలియజేశాడు. పోలీసు శాఖ స్పందించి సంబంధిత అధికారుల ద్వారా వృద్ధుడి ఇంటి వివరాలు సేకరించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కొద్ది గంటల్లోనే కుటుంబ సభ్యులు రామన్‌పాడు చేరుకుని ఖాజా పీర్ ఖాన్‌ను చూసి ఆనందంతో కన్నీళ్లు పెట్టుకున్నారు. అలాగే సదరు యువకుడు అంజాద్ అలీతో పాటు గ్రామస్తులు ఎండీ పాషా, ఖాజా నిజాముద్దీన్, ఎండి ఖలీల్ కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.



కుటుంబ సభ్యులతో వృద్ధుడు

మైసమ్మకు వెండి కిరీటం బహూకరణ



నవాబుపేట: ప్రసిద్ధి చెందిన పర్వతాపూర్ మైసమ్మ దేవతకు మండల కేంద్రానికి చెందిన మొబైల్ వ్యాపారి వెండి కిరీటాన్ని బహూకరించారు. ఆదివారం మండల కేంద్రానికి చెందిన రేవణయ్య కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం దేవాలయ అధికారి నర్సింహులు ప్రత్యేక పూజలు చేసి కిరీటాన్ని అమ్మవారికి అలంకరించారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులను సన్మానించి ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, దాతలు వినయ్‌కుమార్, సంతోష్ పాల్గొన్నారు.

జాతీయ యోగా పోటీలకు ఎంపిక



వెంకటేశ్

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని బండ్లగేరికి చెందిన సీనియర్ యోగా క్రీడాకారుడు కోటకదిర వెంకటేశ్ జాతీయ యోగా పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవలే నల్లగొండలో జరిగిన రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో వెంకటేశ్ మెరుగైన ప్రతిభకనబరిచి సీనియర్ విభాగంలో మూడోస్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించారు. కర్ణాటక రాష్ట్రం మైసూర్‌లోని గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో ఈ నెల 9 నుంచి 12 వరకు జరిగే 50వ (గోల్డెన్ జూబ్లీ) సీనియర్ జాతీయ స్థాయి యోగా స్పోర్ట్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొననున్నాడు. కాగా వెంకటేశ్ రెండోసారి జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు.

గుర్తు తెలియని వాహనం ఢీ.. వ్యక్తి మృతి



ప్రమాదానికి గురైన కారు

అడ్డాకుల: మూసాపేట మండలం కొమిరెడ్డిపల్లి శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ వేణు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు.. నిజామాబాద్ జిల్లాకు చెందిన రమేష్‌రెడ్డి(35) హైదరాబాద్ నుంచి కర్నూలు వైపు కారులో వెళ్తున్నాడు. తెల్లవారుజామున కొమిరెడ్డిపల్లి శివారులో కారును రహదారి పక్కకు నిలిపి కిందికు దిగాడు. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం రమేష్‌రెడ్డిని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదంలో కారు రోడ్డు పక్కన గుంతలో పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించి, మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



షూటింగ్‌బాల్‌లో మూడో స్థానం

మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురులో రాష్ట్రస్థాయి జూనియర్ షూటింగ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా బాలికల జట్టు మెరుగైన ప్రతిభ కనబరిచారు. ఈ టోర్నీలో బాలికల జట్టు మూడో స్థానంలో నిలిచింది.

– మహబూబ్‌నగర్ క్రీడలు

జూరాలకు తగ్గిన వరద

- ఇన్‌ఫ్లో 1.25 లక్షల క్యూసెక్కులు..
- 13 క్రస్టు గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

ధరూరు/ఆత్మకూర్/రాజోళి: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద ఆదివారం తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శనివారం రాత్రి 9 గంటల ప్రాంతంలో 2.32 లక్షలు ఉండగా.. ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో 1.25 లక్షల క్యూసెక్కులకు తగ్గిందన్నారు. దీంతో ప్రాజెక్టు 13 క్రస్టు గేట్లు పైకెత్తి 93,730 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నామని చెప్పారు. విద్యుదుత్పత్తికి 37,982 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 67, ఎడమ కాల్వకు 1,030, కుడి కాల్వకు 500, భీమా లిఫ్ట్–2కు 750 క్యూసెక్కులు వినియోగించినట్లు వివరించారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటినిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 9.439 టీఎంసీలు ఉందన్నారు.

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి..

జూరాల ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రాల్లోని 12 యూనిట్ల నుంచి ఆదివారం ఉత్పత్తి చేపట్టినట్లు జెన్‌కో ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువ ఆరు యూనిట్ల నుంచి 371.472 మిలియన్ యూనిట్లు, దిగువ ఆరు యూనిట్ల నుంచి 370.862 మి.యూ. విద్యుత్ జరిగిందని వెల్లడించారు.

సుంకేసులకు కొనసాగుతున్న వరద..

సుంకేసుల జలాశయానికి ఆదివారం వరద కొనసాగినట్లు జేఈ మహేంద్ర తెలిపారు. ఎగువ నుంచి 17,300 క్యూసెక్కుల వరద రాగా.. మూడు గేట్లను మీటర్ మేర తెరిచి 13,338 క్యూసెక్కులను దిగువకు వదిలామన్నారు. కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులు, జలాశయం నుంచి 15,783 క్యూసెక్కులు దిగువకు విడుదల చేసినట్లు పేర్కొన్నారు.



జూరాల నుంచి దిగువకు పారుతున్న వరద

కోయిల్‌సాగర్‌లో ఒక గేటు ఎత్తివేత

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టు వద్ద ఆదివారం ఒక గేటు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. ఆదివారం ప్రాజెక్టు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న పెద్ద వాగు ఇన్‌ఫ్లోకు అనుగుణంగా నీటిని విడుదల చేస్తున్నారు. రెండు నెలల నుంచి ప్రాజెక్టు గేట్లను తెరిచి నీటి విడుదల కొనసాగిస్తున్నారు. ఇన్‌ఫ్లోను బట్టి గేట్లను సంఖ్యను పెంచుతూ.. తగ్గిస్తూ వస్తున్నారు. ఇదిలా ఉండగా.. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 32.6 అడుగులు కాగా ప్రస్తుతం 32.4 అడుగుల వద్ద 2.25 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

సందర్శకుల తాకిడి..


ఆదివారం సెలవు కావడంతో జిల్లాకేంద్రంతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి వందలాది మంది సందర్శకులు ప్రాజెక్టు వద్దకు తరలివచ్చి జలపరవళ్లను వీక్షించారు. చాలా మంది కుటుంబ సభ్యులతో కలిసివచ్చి ప్రాజెక్టు నుంచి పారుతున్న నీటిలో స్నానాలు చేస్తూ సందడి చేశారు. యువత సెల్ఫీలు దిగుతూ ఆనందించారు.



ఒక గేటు ద్వారా దిగువకు పారుతున్న వరద నీరు

కేశన్న కుంటలో మొసలి కలకలం

పాన్‌గల్: మండలంలోని మాందాపూర్ గ్రామ సమీపంలో గల కేశన్న కుంటలో మొసలి కనిపించడం కలకలం రేపింది. కుంటలో ఉన్న మొసలి అప్పుడప్పుడు బయటికి వస్తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. ఇటీవల వచ్చిన వరదలకు మొసలి కుంటలోకి వచ్చి ఉంటుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. అయితే గ్రామ సమీపంలోనే కుంట ఉండటంతో మొసలితో ప్రమాదం పొంచి ఉందని మాజీ సర్పంచ్ జయరాములుసాగర్ పేర్కొన్నారు. అధికారులు స్పందించి మొసలిని బంధించి వేరే చోటికి తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



మాందాపూర్ కేశన్న కుంటలో మొసలి

క్లుప్తంగా

నేటి నుంచి ఎన్నికల అధికారులకు శిక్షణ

వీపనగండ్ల: స్థానిక ఎన్నికల్లో పాల్గొనే వివిధస్థాయిల అధికారులకు రెండు రోజులపాటు మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో పాల్గొనే రిటరి్నంగ్ ఆఫీసర్స్, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్, ప్రొసీడింగ్, అసిస్టెంట్ ప్రొసీడింగ్ ఆఫీసర్లకు మంగళవారం సర్పంచ్‌లు, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణలో పాల్గొనే ఆర్‌ఓలు, స్టేజ్–1,2 అధికారులకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. శిక్షణలో విధులు నిర్వహించాల్సిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన తెలిపారు.

పాన్‌గల్‌లో శిక్షణ

పాన్‌గల్: సాధారణ ఎన్నికల్లో భాగంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన పీఓ, ఏపీఓలకు సోమవారం రోజు మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గోవింద్‌రావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణకు పీఓ, ఏపీఓలు సకాలంలో హాజరుకావాలని ఎంపీడీఓ సూచించారు.

అనుమానాస్పద మృతి.. కేసు నమోదు

గోపాల్‌పేట: రేవల్లి మండలంలోని చెన్నారం గ్రామానికి చెందిన శివలీలకు పాన్‌గల్ మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన గడ్డం నరసింహ(35) పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి కూతురు, కుమారుడు ఉన్నారు. కాగా పదిరోజుల క్రితం శివలీల భర్తపై అలిగి పుట్టింటికి చెన్నారం గ్రామానికి వచ్చింది. 3వ తేదీన తన భార్యను ఊరికి తీసుకెళ్లేందుకు భర్త గడ్డం నరసింహ్మ చెన్నారం గ్రామానికి వచ్చాడు. నాలుగో తారీఖురోజు నరసింహ గాయాలతో మరణించి కనిపించాడు. నరసింహ తండ్రి నారాయణ కుమారుడి మృతిపై అనుమానం ఉందని పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రేవల్లి ఎస్సై రజిత తెలిపారు.

ఉపాధి కూలీలు ఈకేవైసీ చేయించుకోవాలి

వీపనగండ్ల: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విధానంలో జాబ్‌కార్డు కలిగి ఉన్న ప్రతిఒక్క కూలి ఈకేవైసీ ద్వారా ఆధార్‌సంఖ్యను అనుసంధానం చేయించుకోవాలని పంచాయతీ కార్యదర్శి రమేష్‌రెడ్డి తెలిపారు. జాబ్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరు పంచాయతీ కార్యాలయం వద్దకు వచ్చి నమోదును పూర్తి చేయించుకోవాలని ఆయన కోరారు.

‘హరిత’ పాఠశాలలు

- మొక్కల పెంపకంతో ప్రభుత్వ బడుల్లో ఆహ్లాదకరం
- ఉపాధ్యాయులు, గ్రామస్తుల కృషితో వెల్లివిరుస్తున్న పచ్చదనం


షాపురం ప్రాథమిక పాఠశాలలో చెట్ల సముదాయం


అప్పారెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో..


మానాజీపేట పాఠశాల ఆవరణలో పెరిగిన చెట్లు

ఖిల్లాఘనపురం: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన హరితహారం పథకంలో భాగంగా గ్రామాల్లోని వీధులు, రోడ్లకు ఇరువైపులా, ప్రభుత్వ పాఠశాలలు తదితర ప్రాంతాల్లో మొక్కలు నాటారు. పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మాజీ సర్పంచులు, ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకుని పెంచడంతో మొక్కలు చెట్లుగా పెరిగి పాఠశాలల ఆవరణలు ఆహ్లాదకరంగా మారాయి. మానవునికి ప్రాణ వాయువును అందించే చెట్లపెంపకంలో అందరికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

అప్పారెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో..

మండలంలోని అప్పారెడ్డిపల్లి ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో హరితహారం పథకంలో నాటించిన మొక్కలతో పాటుగా అంతకుముందు విధులు నిర్వహించిన ఉపాధ్యాయులు నాటించిన మొక్కలు ప్రస్తుతం పెద్దచెట్లుగా ఎదిగాయి. గ్రామ మాజీసర్పంచుతో పాటుగా ఉపాధ్యాయులు, విద్యార్థులు, అటెండర్లు ప్రత్యేకశ్రద్ధ తీసుకుని నాటిన మొక్కలకు వేసవిలోను నీళ్లు పోయడంతో నేడు పెద్దచెట్లుగా ఎదిగి ఆవరణ అంతా పచ్చని చెట్లతో ఆహ్లాదకరంగా మారింది. చల్లని నీడను ఇవ్వడంతో పాటుగా కావల్సిన ఆక్సిజన్ అందిస్తున్నాయి.

మానాజీపేటలో..

మండలంలోని మానాజీపేట ఉన్నత పాఠశాలకు వెళ్లిన వారు అక్కడ ఉన్న వాతావరణాన్ని ఆస్వాదిస్తుంటారు. పాఠశాల ఆవరణలో గత 10ఏళ్ల నుంచి ఉపాధ్యాయులు మొక్కలు నాటడంతో ఆవరణ అంతా చెట్లతో చల్లగా ఉంటుంది. ఇక్కడ ఉన్న మొక్కలకు గతంలో నెంబరింగ్ వేసి మరీ రక్షించుకోవడం జరిగింది. వేసవిలోను ఈ చెట్లకు కావల్సిన నీరు పోయించడంతో పచ్చదనం వెల్లివిరుస్తుంది.

షాపురంలో..

మండలంలోని షాపురం ప్రాథమిక పాఠశాలలో గ్రామ సర్పంచు, ఫీల్డ్ అసిస్టెంట్, హెచ్‌ఎంల కృషి ఫలితంగా హరితహారం పథకంలో సుమారు 500 మొక్కలు నాటారు. ఆవరణ లేకపోవడంతో దాతల సహకారం తీసుకుని ప్రహరీని ఏర్పాటు చేసుకున్నారు. ప్రతి చెట్టుకు పాదులు తీసి ప్రతిరోజూ నీరందిస్తున్నారు. వేసవి సెలవుల్లో సర్పంచ్, ఎఫ్‌ఏ ప్రత్యేకశ్రద్ధతో తీసుకుని నీరు పోయించారు. నేడు ఆవరణ మొత్తం పచ్చని చెట్లతో దర్శనమిస్తోంది. అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఈ పాఠశాలలతో పాటుగా మరికొన్ని పాఠశాలల్లో ఆయా గ్రామాల మాజీ సర్పంచులు, ఉపాధ్యాయులు చెట్లను పెంచి ఆవరణను ఆహ్లాదకరంగా మార్చారు. మండలంలోని మిగతా ప్రభుత్వ పాఠశాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

పొంచి ఉన్న ముప్పు..


మల్కిమియాన్‌పల్లి శివారులో కోతకు గురైన బీటీ రోడ్డు

ఖిల్లాఘనపురం: మండలంలోని మల్కిమియాన్‌పల్లి నుంచి అప్పారెడ్డిపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డుకు రైస్ మిల్ దగ్గర రోడ్డు కోతకు గురైంది. ఇటీవల కురిసిన భారీ వర్షానికి బీటీ రోడ్డు కింది బాగాన కోతకు గురైంది. పై భాగాన మాత్రం బాగున్నట్లుగా కనిపిస్తుంది. కేవలం ద్విచక్ర వాహనాలు వెళితే ఎలాంటి ఇబ్బంది లేదు. కాని ఏదైన ఫోర్‌విలర్ వాహనం వస్తే మాత్రం రోడ్డు మొత్తం కూలిపోయి వాహనం కూడా గోతిలో పడిపోయే అవకాశం ఉంది. ఆ ప్రాంతంలోని రైతులు పెద్ద వాహనాలు వస్తే వెంటనే వారికి సమాచారం ఇస్తూ ప్రమాదాన్ని అరికడుతున్నారు. సంబంధిత అధికారులు రోడ్డును పరిశీలించి మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. రోడ్డు కింది భాగాన కోతకు గురైన విషయమై పంచాయతీరాజ్‌శాఖ ఏఈ రమేష్‌నాయుడును వివరణ కోరగా కోతకు గురైన ప్రాంతాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

ఘనంగా విద్యార్థుల వీడ్కోలు వేడుకలు


బీఈడీ అభ్యర్థులతో పాటు అధ్యాపక బృందం

కొత్తకోట రూరల్: మండలంలోని అమడబాకుల గ్రామ సమీపంలో మానస బీఈడీ కళాశాల 2023–25 విద్యార్థులు బీఈడీ పూర్తిచేసుకున్న అభ్యర్థులు ఆదివారం వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నారు. కళాశాలతో, అధ్యాపకులతో తమకున్న జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. జూనియర్ విద్యార్థులు సీనియర్ విద్యార్థులను వీడ్కోలు ప లుకుతూ ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. పాఠాలు నేర్పిన అధ్యాపకులను సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థులు చేసిన ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో చైర్మన్ సాక బాలనారాయణ, యాజమాన్యం సాక నరసింహులు, ప్రిన్సిపాల్ రాములు, అధ్యాపకులు దీపక్, రాంచంద్రయ్య, ప్రసాద్, అంజూమ్, ఇందిర పాల్గొన్నారు.

దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యం


క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న నాయకులు

ఖిల్లాఘనపురం: ప్రధానమంత్రి నరేంద్రమోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమని మండల బీజేపీ అధ్యక్షుడు బుచ్చిబాబుగౌడ్, చిలుక చెన్నయ్యసాగర్ అన్నారు. పీఎం మోదీ 75 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం మండల బీజేపి ప్రధాన కార్యదర్శి గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలస్థాయి క్రికెట్ టోర్నీ నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన వారు ముందుగా మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారతదేశం ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాల జాబితాలో చేరడం జరుగుతుందన్నారు.పీఎం అధ్యక్షతన నేడు అమెరికాకు కూడా భయపడకుండా దేశకోసం పనిచేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో చిన్నచెన్నయ్య, పవన్, భద్రి, రాకేష్, జగదీష్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

వనపర్తి రూరల్: దసరా పండుగ సందర్భంగా పెబ్బేరు పట్టణంలో స్పాటర్ యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించిరు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎంఐఎం మండల అధ్యక్షుడు ఎండీ అఫ్రోజ్ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువు ఎంతనో, ఆటలు అంత ముఖ్యమని వారికి సూచించారు. కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు జాకీర్, జయరాజ్, అమేర్, మస్తాన్, జిల్లా, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎమ్మెల్యే అభినందన



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు పగ్గాల రాములు కూతురు భవానీకి కరీంనగర్‌లో, రాజుగౌడ్ కుమారుడు అరవింద్‌కుమార్‌గౌడ్ మహబూబ్‌నగర్ మెడికల్ కళాశాలలో సీటు సాధించారు. విషయం తెలుసుకున్న దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి దంపతులు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ రావుల సురేంద్రనాథ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్, సీనియర్ నాయకులు రావుల కర్ణాకర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ లక్ష్మీనారాయణ, బీచుపల్లియాదవ్, చంద్రశేఖర్‌రెడ్డి, కావలి రవి ఉన్నారు.

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ర్యాలీ


పెబ్బేరు పట్టణంలో ర్యాలీలో పాల్గొన్న ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు

వనపర్తి రూరల్: ఆర్‌ఎస్‌ఎస్ 100 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం పెబ్బేరు పట్టణశాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానం నుంచి సంఘ్ కార్యకర్తలు శతాబ్ది ఉత్సవాల ర్యాలీ ప్రారంభించి పట్టణ పురవీధుల గూండా నిర్వహించారు. ప్రతిఇంట్లో గణవేష్ సమిత స్వయం సేవక్ ఉండేలా ప్రయత్నం చేద్దాం అని శ్లోకన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

నీటివసతి లేక నిరుపయోగం


ఐకేపీ కార్యాలయంలో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

పాన్‌గల్: మహిళ సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని అధికారులు, పాలకులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం మహిళలకు ఇబ్బందులు తప్పడం లేదు. మండలకేంద్రంలో మహిళ సమాఖ్య కార్యాలయంలో నీటి వసతి లేక మూత్రశాలలు, మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. కార్యాలయం ఆవరణలో ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన మూత్రశాలలు, మరుగుదొడ్లకు నీటిసౌకర్యం కల్పించకపోవడంతో ఆయా గదులకు తాళాలు వేసి ఉంచారు. కార్యాలయం మహిళ సిబ్బంది, సమావేశాలు నిర్వహించిన సమయంలో వివిధ గ్రామాల నుంచి వచ్చే మహిళ సంఘాల సభ్యులు ఇబ్బందులు ఎదుర్కొంటూ ఆరుబయటకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. నీటిసౌకర్యం కల్పించాలని పలుమార్లు జిల్లా అధికారులకు, పాలకులకు విన్నవించినా సమస్య మాత్రం పరిష్కారం కాలేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు కార్యాలయానికి వచ్చిన డీఆర్‌డీఓ ఉమాదేవికి సమస్యను విన్నవించినా పరిష్కారం కాలేదు. మంత్రి జూపల్లి దృష్టికి తీసుకెళ్తే ఆయన మండలస్థాయి నాయకులు, అధికారులను ఆదేశించి కార్యాలయ ఆవరణలో నీటివసతి కోసం బోరును డ్రిల్లింగ్ చేయించాలని వారికి చెప్పిన ఇప్పటివరకు ఇచ్చిన హామీ అమలుకాలేదని మహిళలు వాపోతున్నారు. ఇప్పటికైనా మండలస్థాయి, జిల్లాస్థాయి అధికారులు స్పందించి మూత్రశాలలు, మరుగుదొడ్లకు నీటిసౌకర్యం ఏర్పాటుచేసి వినియోగంలోకి తీసుకురావాలని మహిళలు కోరుతున్నారు.

కనుల పండువగా అమ్మవారి శోభాయాత్ర


అమ్మవారి ఊరేగింపులో మహిళల కోలాటాలు

వనపర్తి రూరల్: దసరా పండుగ ముగింపు ఉత్సవాలు ఆదివారం పెబ్బేరు పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో వైభవంగా ముగిశాయి. పూర్ణహుతి హోమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారి వెండి చీరతో అమ్మవారిని విశేషంగా అలంకరించి మహామంగళ హారతి నీరాజనం ఇచ్చారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ ఆర్యవైష్య అధ్యక్షులు మహేష్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. సాయంత్రం వాసవిమాత ఉత్సవ విగ్రహంను పట్టణంలోని పురవీధుల గూండా శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు , పురుషులు కోలాటాలతో, చిన్నారుల నృత్యాలతో సందడి చేశారు. అక్కడినుంచి బీచుపల్లి కృష్ణానది వద్ద అమ్మవారికి నదీ స్నానం చేయించారు. ఊరేగింపులో భక్తులు, ఆలయసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


అమ్మవారి ఆలయంలో వ్రతాలు చేస్తున్న దంపతులు

విద్యార్థికి సన్మానం



వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని యాపర్ల గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు అల్లిపీర్ కుమారుడు మహ్మద్ ఖాజ మెడిసిన్‌లో మంచి ర్యాంకుతో సీటు సాధించాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో కలసి ఆదివారం బీచుపల్లి ఆలయం దగ్గర విద్యార్థిని శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కర్రె స్వామి, దిలీప్‌కుమార్‌రెడ్డి, వనం రాములు, వడ్డెఈశ్వర్, మాధవరెడ్డి, రాజశేఖర్, నాగేష్ మన్యం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం


సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రేడియంట్ హైస్కూల్‌లో సన్మానిస్తున్న సాహితీ వేత్తలు

వనపర్తిటౌన్: గుణాత్మకమైన విద్యను అందించిన ఉపాధ్యాయులు విద్యార్థుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి పోతారని సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ అన్నారు. ఆదివారం సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రేడియంట్ హైస్కూల్‌లో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన పానగల్ ఎంఈఓ బత్తుల శ్రీనివాసులు, కిష్టగిరి ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు వెంకటేశ్వరగౌడ్‌ను శాలువా, జ్ఞాపికలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర అమూల్యమైందని, సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత బాధ్యతాయుతమైందని చెప్పారు.

విద్యార్థులకు మార్గదర్శం చేస్తూ వారి బంగారు భవిష్యత్తుకు తరగతి గదిలో చక్కని పునాదులు వేసేది ఉపాధ్యాయులేనని ఆయన వివరించారు. కార్యక్రమంలో కళావేదిక ప్రతినిధులు కందూరు నారాయణరెడ్డి, బైరోజు చంద్రశేఖర్, ఎం.ఎ సత్తార్, యేసేపు, ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాష్, నిరంజనయ్య, గంధం నాగరాజు, దేశి రాములు యాదవ్, బండారు శ్రీనివాస్, టి.రాంరెడ్డి, వీరాచారి, బుజ్జిబాబు, రామకృష్ణారెడ్డి, కొత్తకాపు నారాయణరెడ్డి ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న కార్యకర్తలు

కొత్తకోట రూరల్: త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞానవేదిక మండల అధ్యక్షుడు విజయ భాస్కర్ ఆధ్వర్యంలో ఆదివారం పెద్దమందడి మండలంలోని మణిగిళ్ల గ్రామంలో ప్రబోధనంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత గ్రంథాల పరిచయ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. శ్రీకృష్ణుడే జగద్గురువని, జ్ఞానం బోధించే వారిని గురువులు అంటారన్నారు. 'దశ' అంటే పది అని, 'ర' అంటే నశింపజేయడమని ఐదు కర్మేంద్రియాలను ఐదు జ్ఞానేంద్రియాలను యోగ మార్గంలో నశింపజేయడం అంటే మొత్తం పది ఇంద్రియాలను జయింజజేయడమే దసరా పండగ యొక్క అర్థమన్నారు. కార్యక్రమంలో పురుషోత్తం, మాసన్న, వేణుగోపాల్, బాలకృష్ణ, శివ, జాంగీర్, అనిత, శాంత, శైలజ, జ్యోతి, శంకరమ్మ, ప్రమీల, మంజుల ఉన్నారు.

ప్రయాణం.. ప్రమాదకరం


ట్రాక్టర్‌పై వెళ్తున్న తిర్మలాయపల్లి కూలీలు (ఫైల్)

- కూలీల జీవనానికి రక్షణ ఎక్కడ?
- నిబంధనలు పాటించని ట్రాక్టర్ల యజమానులు
- నిద్రావస్థలో రవాణాశాఖ అధికారులు

మదనాపురం: మండలంలోని పరిసరాల్లో కూలీల ప్రాణాలు ఎప్పుడూ ప్రమాదంలోనే ప్రయాణమవుతున్నాయి. ఉదయం, సాయంత్రం వందలాది మంది కూలీలు ట్రాక్టర్లు, ఆటోలు, ప్రైవేట్ వాహనాల్లో కూర్చుని కాకుండా వేలాడుతూ ఇతర మండలాలకు తరలిస్తున్నారు. రహదారులపై ఎప్పుడైనా విషాదం సంభవించే పరిస్థితి కనిపిస్తోంది. తిరుమలాయపల్లి, అజ్జకొల్లు, రామన్‌పాడు, మదనాపురం, దంతనూరు, దుప్పల్లి, కొత్తపల్లి, గోపన్‌పేట గ్రామాల నుంచి కొంకుంట్ల, చిన్నచింతకుంట, ఆత్మకూరు మొదలైన ప్రాంతాలకు పత్తి కూలీ, వరి పొలాల్లో పని చేసేందుకు మహిళలను తీసుకెళ్తున్నారు. ఉదయం 8గంటల నుంచి 9గంటల వరకు సాయంత్రం 5గంటల నుంచి 6గంటల మధ్య నిరంతరం వాహనాలపై ఎలాంటి భద్రతా ఏర్పాట్లు లేకుండా అధికసంఖ్య లో కూర్చోపెడుతున్నారు. అనుకోని చిన్న పొరపాటు జరిగితే ప్రాణాలుపోయే పరిస్థితి. ట్రాక్టర్లు, ఆటోలు భద్రతకు అనుకూలమైన వాహనాలు కావని తెలిసిన కూలీలు వెళ్తున్నారు. అధికారులు ఎందుకు కనీస తనిఖీలు చేయక పోవడం చట్టపరంగా నిబంధనలున్నా అమలు ఉన్న మౌనంగా ఉండటం పలు విమర్శలకు తావిస్తోంది.

రూ.300ల కోసం ప్రాణాలు పణంగా..

రోజుకు కేవలం రూ.300 కోసం కూలీలు ప్రాణాలను తృణ ప్రాయంగా పెట్టి ప్రయాణం చేస్తున్నారు. పోలీసులు తనిఖీలు చేస్తారని తెలుసుకున్న ఆటోలు, ట్రాక్టర్ల యజమానులు వాహనాలను దూరంగా ఆపి కూలీలను దారినడకే పంపిస్తున్నారు. ఈ క్రమంలో కూలీలు ముప్పు పొంచి ఉన్నా కూడా ఆప్షన్ లేక బలవంతంగా అలా ప్రయాణిస్తున్నారు. ప్రతిరోజూ ఇదే పరిస్థితి కొనసాగుతున్నప్పటికీ అధికారుల్లోనూ, వాహన యజమానుల్లోనూ ఎలాంటి మార్పు కనిపించడం లేదు. కూలీల భద్రతను పట్టించుకోని ఈ పరిస్థితిపై స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైన ఉంది.